ఆ సాయంత్రం నేను దొడ్లో మొక్కలకు నీళ్లు పోస్తుండగా మా ఆవిడ పరుగున వొచ్చి- "మీ కోసమో పెద్దపులి వొచ్చిందండి. ముందుగదిలో కూచుంది; వెళ్ళండి" అంది. నన్నుకలుసుకోవడానికి పెద్దపులి రావడ మేమిటా అని ఆశ్చర్యపోయాను.

నేనో పత్రికకి ఎడిటర్‌ని. మా ఇంటికి దేశ రాజకీయ ఆర్థిక సాంఘిక విషయాలపై మేధో చర్చ చేసే మిత్రులూ, తమ కథలూ, వ్యాసాలు ప్రచురించమని అడగడానికొచ్చే సన్నకారు రచయితలూ తప్ప పెద్దపులి ఎప్పుడూ రాలేదు.

పొడుగు ఆరడుగులపైనే వుంటుంది. చిక్కని పసుపు, నారింజ, తెలుపు కలిపిన రంగుల చారల్తో, పొడవయిన తోక, తెల్లని సూదుల్లాంటి మీసాల్తో, భయంకరంగా అందమైన వెడల్పాటి ముఖంతో చాలా హుందాగా పెద్దపులి నన్ను చూడగానే వెనక్కాళ్ళమీద లేచి నిలబడి, వినయంగా నమస్కరించి, 'కూచోండి' అన్నాక మెడలోని సంచి పక్కన బెట్టి పేముకుర్చీలో కూచుంది. "ఏమిటి విషయం" అన్నట్లు చూశాను. పులి సంచిలోంచి పంజాతో ఒక కవరు తీసిచ్చింది. అది రాజారావు నాకు రాసిన వుత్తరం. రాజారావు నాకు దూరపు బంధువు. భద్రాచలం ప్రాంతంలో అటవీ రక్షణాధికారిగా పన్జేస్తున్నాడు.

"ఈ వుత్తరం తీసుకొచ్చే వ్యాఘ్రేశ్వర్రావ్‌ని చూసి జడుసుకోకు. మానుగుంట మడుగు ప్రాంతంలో యితను పేరు పొందిన పులిపెద్ద. బతికి చెడింది, ఇప్పుడు పట్నంలో అడవి సరుకులతో వ్యాపారం జెయ్యడానికొస్తోంది. మిత్రులకి పరిచయం చెయ్యగలవు. అవసరమైన సహాయం చేయగలవు. మిగతా విషయాలు వ్యాఘ్రమే నీకు ముఖతా చెబుతుంది" అని రాశాడు రాజారావు.

'చెప్పండి' అన్నాను వుత్తరం మడిచి కవర్లో పెడుతూ.

పులి సంచి తెరిచి తేనె, యిప్పపువ్వు, కుంకుళ్లు, చెక్కతో, వెదురుతో చేసిన అందమైన అలంకరణ వస్తువులు, నారచీర మొదలయిన శాంపుల్స్ బయటపెట్టింది. చిత్రమైన యాసతో ఇంగ్లీషులో మాట్లాడ్డం మొదలు పెట్టింది. ఈ వస్తువులన్నీ అడవి జంతువులు తయారుచేసినవట. తను పులిపెద్దగా చాలాకాలం వుందట. తను కొంతకాలంగా అనారోగ్యంగా వుంటోందట. డాక్టరు స్థలం మార్చమని సలహా యివ్వడంతొ పట్నం వొచ్చిందట. బతుకు తెరువుకి ఏదో ఒకటి చెయ్యాలి కాబట్టి అటవీ వస్తువులకి ఆర్డర్స్ బుక్ చేసి యిక్కడ సప్లయి చేద్దామనుకుంటున్నదట.

'ఎక్కడ బస చేశారు. మీకిక్కడ యింకెవరన్నా తెలుసా?'అని అడిగాను.

"నా కెవరూ యిక్కడ తెలిసినవాళ్లులేరండి. హోటల్ మేనకలో దిగాను. ఆఫీసుకీ, నేనుండడానికీ కలిపి ఏదన్నా యిల్లు తీసుకునేవరకు అక్కడే వుంటాను. మీ ఎరికలో ఏదన్నా యిల్లుంటే చూడండి. ఇందులో మీకే వస్తువులు కావాలో చెప్పండి. మీ మిత్రులకి పరిచయం చెయ్యండి. మీమేలు మర్చిపోలేను," అంది పులి. ఈలోగా మా ఆవిడ రెండుగ్లాసులతో పాలు తీసుకొచ్చింది. పులి చాలా ఇష్టంగా పాలు తాగింది. వ్యాఘ్రాన్ని ఎవరికి పరిచయం చెయ్యాలా అని ఆలోచిస్తుంటే గౌతమరావు గుర్తొచ్చాడు. వాడు నా చిన్నప్పటి క్లాస్ మేట్. జీవితంలో పైపైకి పోదామనే యాంబిషన్ గలిగిన బిజినెస్‌మన్. రెండు కాళ్ళూ బిజినెస్‌లో పెట్టి అందులోంచి ఒక కాలుతీసి రాజకీయాల్లో పెట్టాలనుకుంటున్నాడు.

"నాతో రండి. గౌతమరావు అనే మిత్రుణ్ణి పరిచయం చేస్తాను. అతనికి చాలామంది ప్రముఖులతో పరిచయముంది. మీకుపయోగపడతాడు" అని లేచాను. పులి మొఖంలో సంతోషం కనబడింది. సంచీలోని కర్చీఫ్ తీసి ముఖం తుడుచుకుని నా వెంట బయల్దేరింది.

పెద్దపులీ, నేను కలిసి పేవ్‌మెంటు మీద నడుస్తుంటే వీధిలోని జనం వింతగా చూశారు. దార్లో నా ప్రశ్నలకి చాలా వినయంగా జవాబిచ్చింది. తనకి అరడజను జంతువుల భాషలూ, ఇంగ్లీషూ వొచ్చునట. తెలుగు, హిందీ నేర్చుకోవాలనుకుంటున్నదట.

గౌతమ్ ఇంట్లోనే హడావుడిగా వున్నాడు. పెద్దపార్టీ నడుస్తోంది. చాలామంది ఖరీదైన మనుషులున్నారు. అందరిచేతుల్లోనూ గ్లాసులున్నాయి. గౌతమ్, అతని మిత్రులూ ముందు జడుసుకున్నా తరువాత వ్యాఘ్రేశ్వర్రావుని కలునుకున్నందుకు ఆనందించారు. నన్నుచూసి "సరిగ్గా సమయానికే వచ్చావ్ గానీ ఏం లాభం, ఎందుకూ పనికి రాకుండా తయారయ్యావ్!" అని గొణిగి, తన మిత్రుడెవడో ఇంగ్లండు వెడుతున్న సందర్భంగా డిన్నర్ ఏర్పాటు చేశానని చెప్పాడు. నేను వ్యాఘ్రాన్ని తీసుకొచ్చిన విషయం చెప్పాను. అందరికీ వ్యాఘ్రాన్ని పరిచయంచేశాడు. అరగంటలో అక్కడున్న బిజినెస్, యితర ప్రముఖుల తలలో, పులి నాలుక అయిపోయింది. వ్యాఘ్రం గౌతమ్ ఆఫర్ చేస్తే సోడా కలపనివ్వకుండా విస్కీ తీసుకుంది. నేను సోడా తాగుతూ కూచున్నాను. వ్యాఘ్రం సిగరెట్టు వెలిగించింది. చికెన్, మటన్, బిర్యానీలు మొగమాటం లేకుండా తీసుకుంది. భోజనం చేస్తున్నంత సేపూ కడుపు చెక్కలయ్యే అడివి జోక్సువేసింది.

చివర్న గౌతమ్, యితర మిత్రులూ వ్యాఘ్రం వ్యాపారానికి తప్పక సాయం చేస్తామన్నారు. అయితే వ్యాఘ్రం యిట్లాగే పెద్దపులిగా వ్యాపారంలోకి దిగితే జనం జడుసుకుంటారని ఏదయినా సాధుజంతువు - అంటే, ఆవు లేక ఎద్దు తలలాంటిది గనుక తలకి తగిలించుకుంటే జనం భయపడరనీ, అనుమానం రాదని, దానివల్ల వ్యాపారం త్వరగా పుంజుకుంటుందని సలహా యిచ్చారు.

"తల వరకే అయితే ఆవు తల పెట్టుకుంటాననుకోండి; మరి, మిగతా శరీరం సంగతేమిటి? పసిగట్టరూ?" అని సందేహం వెలిబుచ్చింది వ్యాఘ్రం.

"మీకా సందేహమక్కర్లేదు. తలవరకే వుంటేచాలు మా జనానికి. మిగతా శరీరం ఎవరిదో, ఏంటో వీళ్ళకి అక్కర్లేదు" అని సందేహ నివృత్తి చేశారు.

ఉదయం నేను ఆఫీసుకి బయల్దేరబోతుండగా జట్కాలోంచి దిగింది వ్యాఘ్రం ఆవు తల మాస్క్‌తో, బావున్నానా సార్" అంటూ. కార్యసాధకుడు, తప్పక పైకివస్తాడు అనుకున్నాను. అదే జట్కాలో గౌతమ్ దగ్గరికి వెళ్ళిపోయింది వ్యాఘ్రం.

* * *

నేనెవరో టెర్రరిస్టుకి మాఇంట్లో ఆశ్రయమిచ్చాననీ, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మా పత్రికలో వ్యాసాలు రాశాననీ ఓ తెల్లవారుఝామున పోలీసులు నన్ను అరెస్టుచేసి తీసుకుపోయారు. నన్నభిమానించే మా పత్రిక యాజమాన్యం ఏం చెబుతున్నా వినిపించుకోకుండా కోర్టువారు నాకు రెండేళ్ళు జైలుశిక్ష విధించారు.

ఇనపచువ్వల వెనక, అహింసాయుతంగా బాదే పోలీసువారి లాఠీలమధ్య రెండేళ్ళు గడిపి, వీలయినంత అనారోగ్యం నా శరీరంలోకి పంపించాక బయటికొచ్చాను.

బయటికి రాగానే యీ రెండేళ్ళలో లోకం చాలా మారిపోయినట్లుగా అనిపించింది. జైలునుంచి నడుస్తూ ఇంటికి బయల్దేరాను. రోడ్డుమీద నా పక్కకొచ్చి ఓ కారు ఆగింది. "హలో సార్! ఇవాళే విడుదలయ్యారా?" అంటూ ఆవుతలతో సూట్లోవున్న వ్యాఘ్రేశ్వర్రావ్ కారుదిగి, 'రండి రండి' అని అతి బలవంతంగా కార్లోకి ఎక్కించుకుని ఒక పెద్ద బంగళాదగ్గరకి తీసుకుపోయాడు. దారిలో వ్యాఘ్రం చాలా విషయాలు హుషారుగా చెప్పింది. తన వ్యాపారం బాగా సాగుతోందిట. తను రాజకీయాల్లోకి కూడా దిగిందట. ఇవాళ తన పుట్టినరోజట. నేను కనబడ్డం తనకి ఎంతో సంతోషంగా వుందట.

కారు బంగళావేపు వెడుతున్నప్పుడు బయటికి తొంగి చూసినప్పుడు అనేక మంది మనుషులకి మెడమీద ఆవుతలకాయలు కనిపించాయి. కొన్ని వందల సంఖ్యలో ఆవుతలల్తో పెద్దపులులు కూడా కనిపించాయి.

పెద్ద పెద్ద వ్యాపారస్తులు, రాజకీయ నాయకులు వ్యాఘ్రం బంగళాలో ఏర్పాటుచేసిన పుట్టిన్రోజు పండగ పార్టీకి బహుమతులతో హాజరయ్యారు. కొంతమంది పంచ-లాల్చీల్లో, కొంతమంది ఖరీదయిన సూట్లలో వున్నారు. దాదాపు అందరి మెడలమీదా ఆవు తలకాయలున్నాయి. పులితోకలున్నాయి. ఎవరికీ అది ఎబ్బెట్టుగా లేదు. చాలా సహజంగా మెసులుతున్నారు. గ్లాసులు ఖాళీ చేస్తున్నారు. తోకలెత్తి పట్టుకుని డాన్సు చేస్తున్నారు.

నేనుబయటికి నడిచాను-ఎవరన్నా మెడమీద మనిషితలకాయున్న మనిషితో మాట్లాడదామని.